మహిళలు సమాజాన్ని ముందుకు నడిపించాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 11 : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది సమాజాన్ని ముందుకు నడిపించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'మహిళలు పెట్టుబడి పెట్టండి.. పురోగతిని వేగవంతం చేయండి' అనే థీమ్ తో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. మహిళలు విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, లింగ వివక్షత పూర్తి స్థాయిలో రూపుమాపాలన్నారు. ఈ సందర్భంగా లింగ వివక్షత లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ సంసిద్ధం కావాలని సూచించారు. ఇంటి నుంచే మార్పు ప్రారంభం కావాలన్నారు. మగపిల్లలు, ఆడపిల్లలని వేర్వేరుగా చూడకుండా ఇద్దరినీ సమానంగా చూడాలన్నారు. ముఖ్యంగా పిల్లల్లో మార్పు తీసుకురావాలన్నారు. అప్పుడే నవ సమాజానికి నాంది అవుతుందన్నారు. మహిళలు తలచుకుంటే ఏదైనా అవలీలగా చేయగలరని మహిళలను అభినందించారు. సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు తమ నైపుణ్యాన్ని, పనితనాన్ని నిరూపించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

బాల్య వివాహాలను అరికట్టాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు తల్లిదండ్రులను ఒప్పించి బాల్య వివాహాలు చేయకుండా అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తే వారికి పుట్టే బిడ్డ ఆరోగ్యకరంగా ఉంటుందని తెలిపారు. ఆడపిల్లల చదువుపట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఒక కుటుంబంలో మహిళ అక్షరాస్యురాలైతే ఆ కుటుంబం బాగుపడుతుందన్నారు. మహిళా సాధికారత కోసం కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న అంగన్‌ఇడీలు, ఆశ వర్కర్లు, ఇతర ఉద్యోగులు మహిళా నవ సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు.

లింగ వివక్షత తగదు

జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి జ్యోతి పద్మ మాట్లాడుతూ.. లింగ వివక్షత లేకుండా ఇద్దరినీ సమానంగా చూడాలని, అవకాశాలు కల్పించాల్సిన అవశ్యతక ఉందన్నారు. మహిళలపై ఆరాచకాలు జరగకుండా ఎలా నిరోధించవచ్చు.. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, కార్యక్రమాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు విద్య, వైద్యం, వ్యాపార ఇతర అన్ని రంగాల్లో అన్నింటా ముందుండి ఉన్నతంగా రాణించాలన్నారు. అమ్మాయిలు తాము ఎంచుకున్న రంగంలో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న మహిళా అధికారులు, సిబ్బందిని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు.

కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ వెంకటేశం, సభ్యులు ధనసిరి ప్రకాశ్, సంగమేశ్వర్, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సుధారాణి, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ మల్లేశం, మెప్మా పీడీ రవికుమార్, గ్రౌండ్ వాటర్ అధికారిణి దీపారెడ్డి, సివిల్ సప్లై ఆఫీసర్ సుగుణ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఉపేందర్, జిల్లా ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్, డీపీఆర్వో చెన్నమ్మ, ఇరిగేషన్ అధికారిణి మాధవి, డీఎస్‌వో హనుమంతరావు, అగ్రికల్చర్ ఆఫీసర్ గోపాల్, ఎల్‌డీఎం రాంబాబు, సీడీపీవోలు ప్రియదర్శిని, వెంకటేశ్వరమ్మ, కాంతారావు, విజయలక్ష్మి, ఇతర మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన మహిళా ఉద్యోగులు

చేవెళ్ల రూరల్ : తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (కాలుష్య నియంత్రణ మండలి) సభ్యుడిగా చేవెళ్ల మండల పరిధి దేవునిఎర్రవల్లి గ్రామానికి చెందిన చింపుల సత్యనారాయణరెడ్డిని ప్రభుత్వం నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సోమవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రూప్-1 సర్వీసుల నియామకం కోసం

ఉచిత కోచింగ్

షాబాద్, మార్చి 11 : జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ విద్యార్థులకు గ్రూప్-1 సర్వీసుల నియామకం కోసం 45 రోజులపాటు ఉచిత కోచింగ్ నిర్వహించనున్నట్లు రంగారెడ్డిజిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఆధార్‌కార్డు, విద్యా ధ్రువీకరణపత్రాలతోపాటు బయోడేటా, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం, రెండో అంతస్తు, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్, కొంగరకలాన్, ఇబ్రహీంపట్నంలో ఈ నెల 17 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కబ్జాకు యత్నిస్తే కఠిన చర్యలు

తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి సర్వే నం.631లో ప్రభుత్వ భూమికి హద్దుల నిర్ధారణ

రోడ్డును కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

తుర్కయాంజాల్, మార్చి 11 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి సర్వే నం.631లో ప్రభుత్వ భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ ఆర్ఐ భిక్షపతి సర్వేయర్‌తో కలిసి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే నం.631లో సర్వే నిర్వహించి హద్దులను నిర్ణయించారు. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ స్థలంలో పాతిన కడీలను రెవెన్యూ అధికారులు తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ భిక్షపతి మాట్లాడుతూ.. ప్రభుత్వ సర్వే నం.631లో కొందరు వ్యక్తులు కబ్జాకు పాల్పడుతున్నారనే ఫిర్యాదు మేరకు సర్వే నిర్వహించామని.. కొంత మేర ప్రభుత్వ స్థలం కబ్జాకు గురయినట్లు గుర్తించామని తెలిపారు. ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుబ్బకుంట కబ్జాపై ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించి నివేదికను అందిస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సర్వే నం.631ని సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

దుబ్బ కుంట కట్ట ధ్వంసంపై కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు

తుర్కయాంజాల్ మున్సిపాలిటీ రెవెన్యూ సర్వే నం.612, 631లో దాదాపు 30 గుంటల విస్తీర్ణంలో ఉన్న దుబ్బకుంట కట్టను ధ్వంసం చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారని.. వారిపై చర్యలు తీసుకోవడంతోపాటుగా దుబ్బకుంటను కాపాడాలని కోరుతూ సోమవారం తుర్కయాంజాల్ గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయం, ఇబ్రహీంపట్నం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. కుంట కబ్జాకు గురైతే గ్రౌండ్ వాటర్ లెవల్ పూర్తిగా తగ్గిపోతుందని.. వెంటనే అధికారులు సర్వే నిర్వహించి దుబ్బకుంటను కబ్జాకోరుల నుంచి కాపాడాలని కోరినట్టు తెలిపారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి తొర్రూర్‌లో రోడ్డును కబ్జా చేసి చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని సోమవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది కూల్చివేశారు. తొర్రూర్‌లో రోడ్డును కబ్జా చేస్తూ నిర్మాణం చేస్తున్నారనే ఫిర్యాదుతో కమిషనర్ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసినట్లు టౌన్ సిబ్బంది తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు హెచ్చరించారు.

కుంటల్లోని నిర్మాణాల కూల్చివేత

పెద్దఅంబర్‌పేట : మున్సిపాలిటీలోని రెండు కుంటల ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపడుతున్న నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులతో కలిసి ఇరిగేషన్ అధికారులు కూల్చివేశారు. కార్ఖానాకుంట పరిధిలో ఉన్న సర్వే నం.64లో ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఐదు బేస్‌మెంట్లను, ఒక ప్రహరీ, కుంట్లూరులోని బావి కుంటలో వెలసిన ప్లాట్ల కడీలను కూల్చివేశారు. ప్రభుత్వ భూములు, కుంట్ల, చెరువుల్లో నిర్మాణాలు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ తస్వీన్‌రాజా, ఆర్ఐ భిక్షపతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

డీఎంహెచ్‌వో డా.వెంకటేశ్వర్‌రావు

శివరాంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

రంగారెడ్డి, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : ఇంటింటికీ తిరిగి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఈ నెల 11 నుంచి 24 వరకు తలపెట్టిన జాతీయ కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం శివరాంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు డీఎంహెచ్‌వో సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ అరుణ, డాక్టర్ అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టా పాసుపుస్తకాలు మంజూరు చేయకపోతే

ఆత్మహత్య చేసుకుంటాం

పెద్దేముల్, మార్చి 11 : తమ పట్టా భూమికి సంబంధించిన పట్టా పాసుపుస్తకాలను రెవెన్యూ అధికారులు మంజూరు చేయడం లేదని సోమవారం పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామానికి చెందిన మహబూబ్ బీ తన కుటుంబ సభ్యులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. సుమారు గంటపాటు కార్యాలయం ఎదుట బైఠాయించి అధికారులు న్యాయం చేయాలని కోరారు. తమకు న్యాయం చేయకపోతే అక్కడే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించడంతో రెవెన్యూ అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు. బాధితుల వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామానికి చెందిన మహబూబ్ బీకి గ్రామ శివారులోని సర్వే నం.243లో 3.03 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో 2007లో సాదా బైనామా పేరుతో అదే గ్రామానికి చెందిన మొగులప్పకు 1.22ఎకరాలు, నర్సప్ప పేరుపై 1.21 ఎకరాల భూమి ఉన్నట్లు అప్పట్లో ప్రభుత్వం ప్రొసీడింగ్ కూడా జారీ చేసింది. అప్పటి నుంచి మహబూబ్ బీ కుటుంబ సభ్యులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ కిషన్‌ను వివరణ కోరగా.. 2008 ఆర్‌ఓఆర్ చట్టం 1036/01.08. 2008 నాటి నుంచి భూమి మహబూబ్ బీ పేరు నుంచి మొగులప్ప, నర్సప్ప పేర్లపై సాదా బైనామా కింద వారు భూమికి హక్కుదారులు అయ్యారన్నారు. ఆ భూమి అప్పటి నుంచి వారి పేరుపైనే ఉంది. భూమి తమది అని వచ్చిన మహబూబ్ బీ వాళ్లు.. ఆ భూమి విషయమై స్పెషల్ ట్రిబ్యునల్ కోర్టుకు వెళితే అక్కడ వీరి పిటిషన్‌ను కొట్టివేయబడింది. తదుపరి మహబూబ్ బీ వాళ్లను సివిల్ కోర్టును ఆశ్రయించాలని సూచించినట్లు తహసీల్దార్ వివరణ ఇచ్చారు.

ఎంజీఐటీలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ పాట్రిక్ ఫెలన్

సాంకేతిక నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి

మణికొండ, మార్చి 11: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుంటూ లక్ష్యాలను సాధించాలని అమెరికాలోని అరిజోన స్టేట్ యూనివర్సిటీలో మెకానికల్, ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ పాట్రిక్ ఫెలన్ అన్నారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో సీజీసీ, యూజీఐటీ, జీఐసీఎఫ్. ఆధ్వర్యంలో 'ది వాల్యూ ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ'అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఇంధన సామర్థ్యం పెంపొందించే అంశాలు, రెన్యువబుల్ రిసోర్సెస్, ఇంధన పునరుత్పాదక వనరులపై పరిశోధన అంశాలను బీటెక్ 4వ సెమిస్టర్ విద్యార్థులకు అందించారు. ఇంజినీరింగ్ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులపై విశ్లేషించాలన్నారు. పరిశోధనలలో మెళకువలును సాధించి భావితరాలకు ఉపయోగపడేలా చేయాలన్నారు. ఇంధన సామర్థ్యాన్ని పెంచే మెలుకువలను పరిశోధన అంశాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, యూసీటీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.సుధాకర్, సీజీసీ చైర్మన్ డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం సారూ.. స్పందించండి..

ముఖ్యమంత్రి ఇలాఖాలో డయాలసిస్ రోగులకు తప్పని ఇబ్బందులు

అందుబాటులో లేని నెఫ్రాలజీ వైద్యులు, అటెండర్‌లు

టెక్నీషియన్‌లతోనే వైద్య సేవలు

పరిస్థితి విషమిస్తే మహబూబ్‌నగర్‌కు తరలింపు

కొడంగల్ సీహెచ్‌సీ ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న కిడ్నీ బాధితులు

కొడంగల్, మార్చి 11 : పట్టణ కేంద్రంలోని సివిల్ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఉందని సంతోషించాలో.. వైద్యులు, అటెండర్‌లు అందుబాటులో లేక వైద్యసేవలకు తలెత్తుతున్న ఇబ్బందులకు అందోళన చెందాలో అర్థం కావడం లేదని కిడ్నీ సంబంధిత రోగులు పేర్కొంటున్నారు. స్థానిక ఆసుపత్రిలో గత ప్రభుత్వం డయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేసి ఏర్పాటు చేసింది. ఆనాటి నుంచి స్థానిక కిడ్నీ సంబంధిత రోగులు చికిత్స పొందుతున్నారు. నియోజకవర్గ పరిధిలో గతంలో 35 మంది కిడ్నీ సంబంధిత రోగులు ఉండేవారని, పరిగిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం కావడంతో ఆ ప్రాంతాలవారు అక్కడే చికిత్స తీసుకుంటున్నట్లు కొడంగల్ డయాలసిస్ సెంటర్ డీఈవో రమేశ్ పేర్కొన్నారు. ప్రస్తుతం డయాలసిస్ సెంటర్‌లో 27 మంది చికిత్స పొందుతున్నారు. ప్రతి రోజూ 15 మందికి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

రక్త పరీక్షల్లో తేడాలు..

గతంలో సీహెచ్‌సీ ఆసుపత్రి 30 పడకల ఆసుపత్రిగా వైద్యసేవలను అందించేది. ఆ తరువాత గత ప్రభుత్వం 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి అన్నింటా సౌకర్యాలతో కూడిన నూతన భవనాన్ని నిర్మించింది. ఎక్స్‌రే, రక్త నమూనా పరీక్షలు, డయాలసిస్ సెంటర్‌తో పాటు ఆపరేషన్ థియేటర్ మంజూరు చేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. డయాలసిస్ ప్రారంభానికి ముందు స్థానిక కిడ్నీ బాధితులు హైదరాబాద్, మహబూబ్‌నగర్, తాండూరు వంటి పట్టణాల్లో వేలాది రూపాయల ఖర్చుతో, వ్యయప్రయాసలకు గురవుతూ చికిత్స పొందేవారు. కిడ్నీ సంబంధిత రోగుల బాధలు అప్పటి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో మొరపెట్టుకోవడంతో, అప్పటి మంత్రి హరీశ్‌రావుతో సంప్రదించి కొడంగల్ సివిల్ ఆసుపత్రిని వైద్య విధాన పరిషత్‌కు అనుసంధానం చేసి మరిన్ని వైద్యసేవలు అందుకునేలా కృషి చేశారు. ఆనాటి నుంచి ఆసుపత్రి అన్నింటా సౌకర్యాలతో మెరుగుపడినప్పటికీ వైద్యుల కొరతతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడం, అత్యవసర పరిస్థితి ఉంటే ఆసుపత్రి సిబ్బంది తాండూరు జిల్లా ఆసుపత్రికి పంపించడంతో బాధితులు చాలా వరకు బాధలను ఎదుర్కొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్య నియామకాలు జరిగి స్థానికంగానే కార్పొరేట్ వైద్య సేవలు అందుకోవచ్చని సంబురపడ్డారు. అనుకున్నట్లుగానే కొడంగల్ ఆసుపత్రిని 220 పడకల ఆసుపత్రిగా, వైద్య కళాశాల ఏర్పాటుతో పాటు ఆసుపత్రిని టీచింగ్ ఆసుపత్రిగా తీర్చిదద్దడంతో నియోజకవర్గ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కానీ ప్రస్తుతమున్న ఆసుపత్రిలో వైద్యుల కొరత మాత్రం అదేవిధంగా ఉందని, ఉన్న వైద్యులు కూడా ఆయా సందర్భాల్లో అందుబాటులో లేకపోవడం ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్నదని రోగులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 220 పడకల ఆసుపత్రి ఏ విధంగా ఉంటుందో..? వైద్య సేవలు ఏ విధంగా అందుబాటులో ఉంటాయోనని అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సీఎం ఇలాఖాలోని డయాలసిస్ సెంటర్ ప్రారంభమైనప్పటి నుంచి కూడా నెఫ్రాలజీ డాక్టర్‌ను నియమించకపోవడం చాలా బాధాకరంగా ఉందని రోగులు వాపోతున్నారు. డయాలసిస్ టెక్నీషియన్‌లతోనే వైద్య సేవలు సరిపెట్టుకోవాల్సి వస్తున్నదని, వారి పరిజ్ఞానం మేరకు కొంత వరకు మంచి వైద్య సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. వైద్యులు అందుబాటులో ఉన్నప్పుడే ఆసుపత్రికి వచ్చే రోగులకు సగం రోగం తగ్గిపోతుందని పేర్కొంటున్నారు. ఉన్నంత వరకు డయాలసిస్ టెక్నీషియన్ వైద్యసేవలు అందిస్తున్నప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం ఆసుపత్రికి తరలిస్తున్నారని, ఆ సమయంలో రోగులు తీవ్రంగా ఇబ్బందులకు గురి కావడంతో పాటు వ్యయప్రయాసలకు గురి కావాల్సి వస్తున్నదని ఆరోపిస్తున్నారు. కొడంగల్ ఆసుపత్రిలో రక్త పరీక్షలు నిర్వహించుకుంటే ఓ విధంగా రిపోర్టులు.. మహబూబ్‌నగర్ ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయించుకుంటే మరో విధమైన రిపోర్టులు చాలా వరకు తేడాలు వస్తున్నాయని రోగులు ఆరోపించారు. ఇటువంటి వ్యత్యాసాలను పరిశీలిస్తే సిబ్బంది నిర్లక్ష్య వైఖరి కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నదని, ఏది సరైందో నిర్ణయించుకోలేకపోతున్నామని వాపోతున్నారు. బాధితుల బాధలను గమనించి సీఎం సార్ కొడంగల్ ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

5,6 సార్లు ఫిస్తులా ఫెయిల్ అయ్యింది

కొంత కాలంగా స్థానికంగా డయాలసిస్ సేవలను అందుకుంటున్నాను. అప్పట్లో డయాలసిస్ సెంటర్ అందుబాటులో లేని సమయంలో మహబూబ్‌నగర్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లి వేలకు వేల ఖర్చుతో చికిత్స చేయించుకున్నాను. స్థానికంగా డయాలసిస్ సెంటర్ ఏర్పాటు కావడంతో ఆనాటి నుంచి ఇక్కడే చికిత్స పొందుతున్నాను. నెఫ్రాలజీ వైద్యులు అందుబాటులో లేకపోవడం చాలా ఇబ్బందిగా మారింది. 5,6 సార్లు ఫిస్తులా ఫెయిల్ అయ్యి ఆందోళన చెందాం. ప్రస్తుతమున్న టెక్నీషియన్‌లు వారికున్న పరిజ్ఞానంతో వైద్యం చేస్తున్నారు. కానీ సంబంధిత వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇటువంటి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. సీఎం నియోజకవర్గంలో ఇటువంటి ఇబ్బందులు ఎదురైతే రోగుల పరిస్థితి ఏవిధంగా ఉంటుంది. ముఖ్యమంత్రి స్పందించి అసుపత్రిలో పూర్తి స్థాయి వైద్యుల నియామకాలు చేపట్టాలి.

- ఫకీరప్ప, కిడ్నీ బాధితుడు, అంగడిరైచూర్, కొడంగల్

వైద్యులతో పాటు అటెండర్‌లు కరువు..

నెఫ్రాలజీ వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల డయాలసిస్ చికిత్సకు తీవ్రంగా ఇబ్బందులకు గురి కావాల్సి వస్తున్నది. టెక్నీషియన్‌లతోనే చాలా కాలంగా చికిత్సను పొందుతున్నాం. సంబంధిత వైద్యులు లేకపోవడం వల్ల పూర్తి స్థాయి వైద్య చికిత్సను అందుకోలేకపోతున్నాం. అటెండర్‌లు కూడా అందుబాలులో లేకపోవడం మరింత ఇబ్బంది ఏర్పడుతున్నది. మొదటి అంతస్తులో చికిత్స పొందేందుకు నడవలేకపోతున్నాం. అటెండర్ తప్పనిసరి. సొంతవారు లేని వారికి మరింత ఇబ్బంది. రక్త పరీక్షల్లో కూడా ఇక్కడికి మరో ఆసుపత్రికి రిపోర్టులు చాలా తేడా వస్తున్నాయి. దాంతో మరింత ఆందోళనకు గురౌతున్నాం. వైద్యులు అందుబాటులో ఉంటే స్థిమితంగా చికిత్సను పొందవచ్చు.

- ఉమామహేశ్వర్‌రెడ్డి, కిడ్నీ బాధితుడు, హస్నాబాద్, కొడంగల్

నెఫ్రాలజీ వైద్యుల నియామకం జరగలేదు

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు నుంచి కూడా నెఫ్రాలజీ వైద్యుల నియామకం జరగలేదు. టెక్నీషియన్స్‌తోనే చికిత్స కొనసాగుతున్నది. గతంలో ఇక్కడ 35 మంది వరకు చికిత్స అందుకునేవారు. పరిగిలో సెంటర్ ఏర్పాటు కావడంతో కొంత మంది అక్కడ చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం 27 మందికి.. రోజువారీగా 15 మందికి చికిత్స అందిస్తున్నాం.

- రమేశ్, డయాలసిస్ సెంటర్ డీఎంవో, సీహెచ్‌సీ ఆసుపత్రి, కొడంగల్

రంగారెడ్డిజిల్లా అడిషనల్ డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న స్వప్న

కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న

షాబాద్, మార్చి 11 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఏలమోని స్వప్న డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డిజిల్లా అడిషనల్ డీఈవోకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు, బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా స్పందన కరువైందని చెప్పారు. గత నెల 28న కలెక్టర్ కార్యాలయం ముట్టడి సందర్భంగా రెండు, మూడు రోజుల్లో వేతనాలు, బిల్లులు ఇస్తామని చెప్పారని కానీ, ఇన్ని రోజులు గడుస్తున్నా ఇప్పటికీ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు సామాజికంగా బడుగు, బలహీన వర్గాలకు చెందినవారని తెలిపారు. సమాయానికి బిల్లులు రాక, జీతాలు అందక ఇళ్లు గడవడం లేదని చెప్పారు. అప్పులు చేసి కిరాణ దుకాణాల్లో సామగ్రి తీసుకురావాల్సి వస్తున్నదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పాఠశాలల్లో విద్యార్థులకు ఎలా అన్నం పెట్టాలని ప్రశ్నించారు. నాలుగు నెలల వేతనాలు, ఐదు నెలల పెండింగ్ బిల్లులు, మూడు నెలల బ్రేక్‌ఫాస్ట్ బిల్లులు ఇవ్వాలని గుర్తు చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులు వెంటనే ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణ, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సభ్యులు అలివేలు, పద్మ, రాధ పాల్గొన్నారు.